ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి ములుగు



మంగళవారం 22 అక్టోబరు 2024

పల్లెలకు మెరుగైన రవాణా వ్యవస్థ

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగు జిల్లాలో రూ.21.56 కోట్లతో రోడ్ల పనులకు శంకుస్థాపన

6



తాడ్వాయి మండలంలో రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

క్రైం కార్నర్

సరిహద్దులో అలజడి

- మహారాష్ట్ర గడ్చిరోలి బామ్రఘడ్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం

మహదేవపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గడ్చిరోలి జిల్లా బామ్రఘడ్ తాలూకా కోప్రి అటవీ ప్రాంతంలో సోమవారం మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగినట్లు తెలిసింది. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులు పలు ఘటనలకు పాల్పడే ఉద్దేశంతో అటవీ ప్రాంతంలో సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు... 60 బెటాలియన్‌కు చెందిన బలగాలు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య భీకర కాల్పులు జరిగినట్లు సమాచారం. ఇందులో నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు పోలీసులు గాయపడిన ట్లు గడ్చిరోలి ఎస్పీ పేర్కొన్నారు. కాగా, ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యువకుడి ఆత్మహత్య

మహదేవపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి టెంపుల్ శివారు అడవిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక పోలీసులు తెలిపిన ప్రకారం... జార్ఖండ్‌కు చెందిన విష్ణు (20) మహదేవపూర్ మండలం ఎడపల్లి వద్ద బోరువెల్ టెస్టింగ్‌లో పని చేస్తున్నాడు. 20 రోజుల క్రితం జార్ఖండ్ నుంచి వచ్చి టెస్టింగ్‌లో పని చేస్తున్నాడు. ఈనెల 18న బోర్‌వెల్ టెస్టింగ్ నుంచి బయటకు వెళ్లిపోయి అయ్యప్పస్వామి శివారులో ఉన్న అడవిలో సోమవారం ఉరివేసుకుని చనిపోగా మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రహదారి వెంట వెళ్లే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. కాగా, ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెట్టి అప్పుల పాలై తీవ్రంగా నష్టపోయి ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపం చెంది విష్ణు మృతి చెందాడని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. మృతుడి స్నేహితుడు జార్ఖండ్‌కు చెందిన దనీష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పరిమితికి మించి ఇసుక రవాణా చేయొద్దు

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ఇసుక రవాణా చేసే వాహనాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం భూ పాలపల్లి కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీసు, టీజీ ఎండీసీ, మైనింగ్, రవాణా, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, భూగర్భ జల శాఖల అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిమితికి మించి ఇసుక రవాణా చేస్తుండ టంతో రహదారులు దెబ్బతిని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నియంత్రణకు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానా విధించాలన్నారు. వర్షాల వల్ల అన్నారం, చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఇసుక తీసేందుకు టీజీ ఎండీసీ ఎండీకి సిఫారసు చేయాలన్నారు.



ఈ ఏడాదీ.. కొనుగోస తప్పదా?

హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పంట వేసిన నాటి నుంచి చేతికొచ్చే వరకు.. చివరకు ఆ పంటను అమ్ముకునే సమయంలోనూ రైతన్నలకు అవస్థలు తప్పవు. అలాంటి అవస్థల నుంచి రైతులకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలతోనూ పెద్దగా ఒనగూరిందేమీ లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ సీజన్‌లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలు నిండా ముంచుతున్నాయి. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. తెచ్చిన ధాన్యాన్ని ఆరబోసేందుకు చాలినంత స్థలం లేకపోవడంతో తేమ సమస్యను ఎదుర్కొంటున్నారు. తేమ శాతం సాకుగా చూపి కేంద్రాల నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారు. కొన్న తర్వాత ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలోనూ రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. తీరా రైస్‌మిల్లులకు తీసుకువెళ్లిన తర్వాత మిల్లర్లు ధాన్యం సరిగా లేదని తీసుకోవడానికి కొర్రీలు పెడుతున్నారు. ఇలా అడుగడుగడుగునా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందులను తొలగించే విషయంపై పౌరసరఫరాల శాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిపెట్టడం లేదు. కనీసం ఈ సీజన్‌లో అయినా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏర్పాట్లపై స్పష్టత కరవు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. తగినన్ని ఏర్పాట్లు చేయకపోతే గత సీజన్‌లో మాదిరిగానే ఈ సారి కూడా రైతులకు కష్టాలు తప్పవు. గతేడాది కేంద్రాలకు టార్పాలిన్లను సరిగా అందించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల సమస్యలు, వారి ఇబ్బందులను ఎలా అధిగమించాలనే విషయంపై ప్రస్తుతం అధికారుల్లో స్పష్టత కనిపించడం లేదు. కేవలం ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుంది, కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేయాలి, సన్న రకాలను గుర్తించేందుకు ఎన్ని సూక్ష్మ మీటర్లను ఉపయోగించాలి అనేవాటిపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 1,137 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం.

- సీజన్లు మారుతున్నా మారని తీరు
- కేంద్రాల వద్ద కానరాని వసతులు
- టార్పాలిన్లు లేక అకాల వర్షాలకు పంట నీటిపాలు
- గోనె సంచులు, రవాణాలోనూ అస్తవ్యస్తం
- ధాన్యం అమ్మకాల ప్రక్రియలో రైతులకు తప్పని అవస్థలు
- నాణ్యత సాకుతో తీసుకోవడానికి మిల్లర్ల నిరాకరణ
- ఉమ్మడి జిల్లాలో ఈ సారి 1,137 కేంద్రాల ఏర్పాటు
- 12లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం



వేధిస్తున్న స్థల సమస్య

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థల సమస్య వేధిస్తోంది. అరకొరగా ఉన్న స్థలాల్లో ధాన్యం ఆరబోసేందుకు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రహదారులపై ధాన్యం ఆరబోయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో మాదిరిగా ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అందించడం

▸▸ మిగతా 6వ పేజీలో..

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- మోడికుంట ప్రాజెక్టును సీఎం దృష్టికి తీసుకెళ్తా
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



చంద్రుపట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వాజేడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు జీపీలలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా కృష్ణాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అక్కడి ప్రజలు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. మోడికుంట ప్రాజెక్టు రెండు దశాబ్దాల కాలంగా పెండింగ్ ఉందని, ఆ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే మండలంలోని సుమారు 15వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోడికుంట ప్రాజెక్టు నిర్మాణంపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, సీతక్కలతో మాట్లాడి ప్రాజెక్టు నిర్మాణంకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా టేకులగూడెంలో అంగన్‌వాడీ భవనం ఉన్నప్పటికి టీచర్ పోస్టు ఖాళీగా ఉందని, అంతర్గత రోడ్ల నిర్మాణాలు జరపాలని ప్రజలు కోరగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చంద్రుపట్లలో స్థానికులు గోదావరి వరదల వల్ల తమ గ్రామం మునిగిపోయే పరిస్థితి ఉందని గోదావరికి కరకట్ట నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విషయంపై రానున్న అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడతానని తెలిపారు. పేరూరులో వైద్యశాలను తనిఖీ

▸ మిగతా 8వ పేజీలో...

ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- అమరవీరుల స్థూపం వద్ద నివాళులు
- రక్తదానం చేసిన ఎస్పీ, అదనపు ఎస్పీ
- శ్రద్ధాంజలి ఘటించిన కలెక్టర్ రాహుల్‌శర్మ



భూపాలపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, సబ్ కలెక్టర్

భూపాలపల్లి కృష్ణకాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఆర్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మ యాంక్ సింగ్‌లు పాల్గొన్నారు. ముందుగా పోలీసు అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమర వీరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. అలాగే, అమరవీరుల కుటుంబసభ్యులు సైతం స్థూపానికి పూల మాలలు వేసి వారిని గుర్తు చేసుకున్నారు. తదుపరి కలెక్టర్, ఎస్పీ, కాటారం సబ్ కలెక్టర్ అమరవీరుల కుటుంబీకులకు గృహోపకరణాలను అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని కలెక్టర్, ఎస్పీలు ప్రారంభించారు. ఎస్పీ కిరణ్‌ఖరేతోపాటు అదనపు ఎస్పీ బోనాల కిషన్, జిల్లా పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవే ఎంతో కీలకమని, ప్రజావసరాలు, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ

▸ మిగతా 8వ పేజీలో...

పోలీసు అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివి

- సంస్మరణ దినోత్సవంలో ములుగు ఎస్పీ శబరీశ్



ములుగులోని పోలీసు ప్రధాన కార్యాలయంలో అమరుల కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. ములుగులోని జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ పాల్గొని విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులు ఎప్పటికీ మన హృదయంలో నిలిచిపోతారన్నారు. వారి త్యాగాలు మరువలేనివని, మనమందరం వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలబడాలని అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ములుగు జిల్లాలో పోలీసులు ధైర్యంగా పని చేస్తున్నారని, తమ ఉద్యోగ విధుల్లో ఎలాంటి ఒత్తిడి వచ్చినా, ఎంత కఠినమైన పరిస్థితులు నెలకొన్నా ఏమాత్రం భయభ్రాంతులకు గురికాకుండా జిల్లా పోలీసులు పనిచేస్తున్నారని అన్నారు. వరదల సమయంలో ప్రజలను సంరక్షించడంలో భాగంగా ప్రాణాలకు తెగించి అహర్నిశలు శ్రమించారని, శాంతిభద్రతలను కాపాడడంలో ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖ దేశానికి సేవ చేయడం అత్యంత ప్రధానమైందని, మనమందరం ఒకే లక్ష్యంతో కలిసి పనిచేయాలన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, రాములు, సీఐలు బండారి కుమార్, షేక్ మస్తాన్, ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, తాజొద్దీన్, టీవీ సూరి, హరీష్, ఆర్ఎస్సైలు గోపీచంద్, నిర్మల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలి



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను జవాబుదారితనంతో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం భూపాలపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నందున మండల పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారానికి ప్రతీ శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 45 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జయశంకర్ కాలనీలో నిర్వహిస్తున్న ప్యారడైజ్ బార్ అండ్ రెస్టారెంట్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు కలెక్టర్ రాహుల్‌శర్మకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మద్యం తాగిన వారు వాహనాల శబ్దాలు చేయడంతో పాటు మూత్ర విసర్జన చేయడం, వ్యర్థాలను రోడ్లపై వేస్తూ మద్యం సీసాలను పగలకొడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీవాసుల ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ బార్‌ను అక్కడి నుంచి వేరే చోటు తరలించాలని ఆబ్కారీ శాఖకు సూచించారు.

వృద్ధురాలి నిరసన

తన భూమిని కబ్జాచేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, భూమిని వెంటనే ఇప్పించాలని కోరుతూ ఓ వృద్ధురాలు గడ్డిమందు ప్యాకెట్‌తో ప్రజావాణికి వచ్చి నిరసన వ్యక్తం చేసింది. రేగొండ మండల కేంద్రానికి చెందిన రాజమ్మ తన భూమి ఇతరులు కబ్జాచేసి వేధిస్తున్నారని, కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని పేర్కొనడంతో గుర్తించిన అధికారులు గడ్డిమందు ప్యాకెట్‌ను తీసివేశారు. రేగొండ మండల కేంద్రంలోని 493/1లో ఉన్న 20 గుంటల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని తెలిపింది. బాధితురాలి సమస్య విన్న కలెక్టర్ పూర్తి వివరాలతో నివేదిక అందించాలని రేగొండ తహసీల్దార్‌ను ఆదేశించారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

ఆశా కార్యకర్తల దినచర్య పుస్తకంలో ప్రజల ఆరోగ్య వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆశా కార్యకర్తల దినచర్య పుస్తకంను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య వివరాల నమోదు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల పరిపాలన దినచర్య పుస్తకం ద్వారా మరింత సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో మధుసూదన్, ఆర్డీవో మంగీలాల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



గాలిదుమారంతో భారీ వర్షం

- పలుచోట్ల నేలవాలిన వరి

కాటారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెరకుంట, లక్ష్మీపూర్, గుండ్రాత్‌పల్లి, గంగపురి, మల్లారం, విలాసాగర్ గ్రామాల పరిధిలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి గాలిదుమారంతో భారీ వర్షం కురిసింది. పలు చోట్ల కోత దశలో ఉన్న వరి నేల వాలింది. పత్తి చేన్లలోకి వరద నీరు చేరి నష్టం వాటిల్లింది. ఇటీవల కురిసిన వర్షాలతోనే పంటలు దెబ్బతినగా, మరోసారి దంచి కొట్టిన వానతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా వర్షం కురియకుండా కొన్ని గ్రామాల పరిధిలోనే సుమారు 40 నిమిషాల పాటు భారీ వర్షం కురియడం గమనార్హం. ప్రభుత్వం నష్టం జరిగిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

← దామెరకుంటలో నేలవాలిన వరి పంట

ఓటరు నమోదు విచారణను పూర్తిచేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ స్థానాల ఓటరు నమోదు దరఖాస్తుల ప్రాథమిక విచారణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడిన సుదర్శన్‌రెడ్డి పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి ఓటరు రూపకల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుకు వస్తున్న దరఖాస్తుల విచారణను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలన్నారు. ఓటరు జాబితా నమోదు 2025 కోసం స్వీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాలని అన్నారు. ఓటరు నమోదుతో పాటు దివ్యాంగులు, థర్డ్ జెండర్, సెక్స్‌వర్కర్స్ తదితర వర్గాల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



రాజిరెడ్డి భార్య పద్మకు బీమా చెక్కును అందజేస్తున్న రవీందర్‌రావు

రూ.8 లక్షల బీమా చెక్కు అందజేత

హనుమకొండ సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ జిల్లా ఇస్సీపేట గ్రామానికి చెందిన రైతు యార రాజిరెడ్డి కుటుంబానికి రూ.8 లక్షల బీమా చెక్కును టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అందచేశారు. సోమవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రాజిరెడ్డి సతీమణి పద్మకు బీమా సొమ్ము చెక్కును ఇచ్చారు. రాజిరెడ్డి ఇటీవలే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. డీసీసీ బ్యాంక్ నుంచి కర్షక మిత్ర ద్వారా రుణాన్ని పొందిన ఆయన ఇన్సూరెన్స్ చేశారు. రాజిరెడ్డి మృతితో బీమా డబ్బుల చెక్కును ఆయన సతీమణికి అందచేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జీయం ఉషాశ్రీ, డీజీయం అశోక్, ఏజీయం మధు, రాజు, కృష్ణ మోహన్, గొట్టం స్రవంతి, గంప స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పీజీ 1, 2 సెమిస్టర్ షెడ్యూల్ వెల్లడి

కేయూ క్యాంపస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ ఎంసీజే, ఎంటీఎం, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంఎస్సీ(సీఎస్)ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎల్‌ఎస్సీ, ఎంసీఏ మొదటి, రెండో సెమిస్టర్ అల్మాన్యాక్ షెడ్యూల్‌ను వర్సిటీ ఉన్నతాధికారులు సోమవారం విడుదల చేశారు. అక్టోబరు 21 నుంచి మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమౌతాయని, నవంబరు 21 వరకు మొదటి సెమిస్టర్‌కు రీ అడ్మిషన్ల గడువు ముగింపు, నవంబరు 27 నుంచి 30 వరకు మొదటి ఇంటర్నల్ పరీక్షలు, 11 జనవరి-2025 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు, ఆన్‌లైన్ క్లాసల నిర్వహణ, జనవరి 16న కళాశాల రీ ఓపెనింగ్, జనవరి 21 నుంచి 23 వరకు రెండో ఇంటర్నల్ పరీక్షలు, ఫిబ్రవరి 11 తరగతుల నిర్వహణతో పాటు ఫిబ్రవరి 13 నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు 2025 మార్చి 1న ప్రారంభమవుతాయని ఏప్రిల్ 1 వరకు రీ అడ్మిషన్లకు అవకాశం ఉందని జూలై 11 నుంచి రెండో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని వర్సిటీ అల్మాన్యాక్‌ను అధికారులు వెల్లడించారు.

టీచర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

జనగామ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఉపాధ్యాయుల ఓటరు నమోదులో భాగంగా సోమవారం జనగామ మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ నవంబరు 6 లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ వికాసం కోసం పని చేసేవారిని ఎన్నుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు, సుధీర్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాసరావు, చంద్రమౌళి, వీరాంజని తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

గిరిజన దర్బార్‌లో పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన దర్బార్‌లో గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యల పరిష్కారానికై సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. సోమవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించి గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 17 మంది గిరిజనులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా భారీగా ఖర్చు అయిందని, ట్రైబల్ రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ఏటూరునాగారం మండలం ముల్లకట్ట గ్రామానికి చెందిన కొడిపి లక్ష్మి పీవోను వేడుకున్నారు. ఇసుక క్వారీ నిర్వహణకు సహకార సొసైటీ సంఘం లిమిటెడ్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలని మంగపేట మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన శ్రీ నాగులమ్మ గిరిజన సొసైటీ సభ్యులు పీవోకు విన్నవించారు. అదేవిధంగా గిరివికాస పథకం ద్వారా పొలంలో బోరు సౌకర్యం కల్పించాలని మంగపేట మండలానికి చెందిన నరసింహస్వామి పీవోను కోరారు. జీవనోపాధి కోసం ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని వెంకటాపురం(రామప్ప)కు చెందిన కొత్తపల్లి స్వరూప పీవోకు వినతి పత్రం అందించారు. సాగు చేసుకుంటున్న భూమికి అటవీహక్కు పత్రాలివ్వాలని తాడ్వాయి మండలం వీరాపురంనకు చెందిన ఆగబోయిన నర్సయ్య పీవోకు మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దర్బార్‌లో గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో చిత్రామిశ్రా

పల్లెలకు మెరుగైన రవాణా

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగు జిల్లాలో రూ.21.56 కోట్లతో రోడ్ల పనులకు శంకుస్థాపన



వెంకటాపూర్ జడ్పీ హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి/ గోవిందరావుపేట/ వెంకటాపూర్/ మేడారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని, ప్రధాన రహదారులతో పాటు లింకు రోడ్లను అభివృద్ధి చేయడం ద్వారా పల్లె జీవన ప్రమాణాలు పెంచుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో సోమవారం మంత్రి విస్తృతంగా పర్యటించారు. వెంకటాపూర్ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మౌరిటెక్ ఐటీ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో రూ.21.56 కోట్ల సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నిధులతో చేపట్టిన 15 రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుందన్నారు. డిసెంబరు 9 వరకు రైతులందరికీ రూ.2లక్షల లోపు రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేసామని స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా 176 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు ములుగు మండలం ఇంచర్లలో రూ.125కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేసిన విషయం గుర్తు చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను కలుపుతూ మెరుగైన రోడ్లను నిర్మిస్తామని, రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు దారులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో నూతన నిర్మాణాలకు అటవీ చట్టాలు ఇబ్బందిగా మారాయని, ప్రత్యామ్నాయంగా కంటైనర్లలో ఆస్పత్రులు, పాఠశాలలు ఏర్పాటు చేసి మారుమూల ప్రాంత ప్రజలకు విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. అటవీ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల విషయ మై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సాంకేతికత విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించగలుగుతారన్నారు. కార్పొరేట్ సంస్థల సహకారంతో నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. అనంతరం గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సాయంత్రం తాడ్వాయి మండలంలో మోస్తరు వర్షం కురువగా తడుస్తూనే మంత్రి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ దివాకర, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, డీఈవో పాణిని, మౌరిటెక్ ఐటీ కంపెనీ ప్రతినిధులు నందమోహన్, మనోజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు.. నిధులు...

గోవిందరావుపేట మండలం చల్వాయి క్రాస్ నుంచి బుస్సాపూర్ వరకు రూ.3.60కోట్లతో రోడ్డు పనులను మంత్రి సీతక్క ప్రారంభించారు. గోవిందరావుపేట నుంచి దుంపెల్లిగూడెం వరకు రూ.కోటీ58లక్షలు, బాలాజీనగర్ నుంచి లక్ష్మీపూర్ వరకు రూ.1కోటీ20లక్షలు, పాపయ్యపల్లి నుంచి మొద్దుల గూడెం వరకు రూ.70లక్షలు, మొద్దులగూడెం నుంచి కర్లపల్లి వరకు రూ.కోటీ 28లక్షలు, గాంధీనగర్ వద్ద రూ.30లక్షలు, తాడ్వాయి మండలం కాటాపూర్ నుంచి దామెరవాయి వరకు రూ.60లక్షలు, భూపతిపూర్ వద్ద రూ.44లక్షలు, కాటాపూర్-భూపతిపూర్ మధ్య రూ.55లక్షలు, కాటాపూర్ నుంచి పంబాపూర్ వరకు రూ.కోటీ 41లక్షలు, కాటాపూర్ క్రాస్ నుంచి బస్టాండ్ వరకు రూ.64లక్షలు, మేడారంలోని శివరాంసాగర్ చెరువు నుంచి మేడారం వరకు రూ.2కోట్ల 75లక్షలు, స్థూపం నుంచి సారలమ్మ ఆలయం వరకు రూ.2కోట్లు, స్థూపం నుంచి ఊరట్టం వరకు రూ.2కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కాల్వపల్లి వరకు రూ.2.5కోట్లతో రహదారి మరమ్మతు పనులను సీతక్క ప్రారంభించారు.

కారు, బైక్ ఢీ

క్రైం న్యూస్

- ఇద్దరు యువకుల దుర్మరణం
- మహబూబాబాద్ శివారు అర్బన్‌పార్కు వద్ద ఘటన



మణికంఠ అరుణ్‌కుమార్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అర్బన్ పార్కు వద్ద కారు, బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం పొనుగోడు గ్రామానికి చెందిన నీల రమేష్-గౌతమిల రెండో కుమారుడు అరుణ్‌కుమార్ (17) మహబూబాబాద్‌లోని జ్యోతిరావుపూలే గురుకులంలో ఇంటర్ (సీఈసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన సంగెం ఉపేందర్-మంజుల దంపతుల ఏకైక కుమారుడు మణికంఠ(18) హైదరాబాద్‌లో శ్రీ చైతన్యలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు.

దసరా సెలవులు ముగియడంతో తన స్నేహితుడైన అరుణ్‌కుమార్‌ను గురుకులంలో దించేందుకు బైక్‌పై తీసుకువస్తున్నాడు. జిల్లా కేంద్రం శివారు అర్బన్‌పార్కు సమీపంలోకి రాగానే మహబూబాబాద్ నుంచి గూడూరు వైపు వెళ్తున్న కారు ఎదురుగా వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న అరుణ్ కుమార్, మణికంఠలు అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ సర్వయ్య, ఎస్సై దీపికరెడ్డి ఇరువురి మృతదేహాలను జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అర్బన్ పార్కు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరుణ్‌కుమార్, మణికంఠ కుటుంబాలకు అండగా ఉంటామని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇరువురు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన

తమకు న్యాయం చేయాలని జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. సీఐలు సర్వయ్య, పెండ్యాల దేవేందర్, ఎస్సై దీపికారెడ్డి వారికి నచ్చచెప్పినా వినలేదు. ఫోన్ ద్వారా డీఎస్పీ తిరుపతిరావు ఆందోళనకారులతో మాట్లాడి కుటుంబ సభ్యులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యుదాఘాతంతో గిరిజన రైతు మృతి



రాంజీ (ఫైల్)

గూడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :విద్యుదాఘాతంతో గిరిజన రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బోరింగ్‌తండాలో సోమవారం చోటు చేసుకుంది. గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోరింగ్‌తండాకు చెందిన బానోత్ రాంజీ (68)కి రెండె వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి, మిర్చి పంటలను సాగు చేశాడు. వరిపంటకు నీరు పెట్టేందుకు బావి వద్దకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న బావిలోపడ్డాడు. వ్యవసాయ బావి వద్ద వెళ్లిన రాంజీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వ్యవసాయం క్షేత్రం వద్ద వెళ్లి పరిశీలించగా రాంజీ బావిలో విగత జీవిగా కన్పించాడు. మృతుడికి భార్య రంగీ, కుమారుడు శ్రీను, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఖాసీం రాంజీ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులకు పరామర్శించారు.

ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తుల విచారణలో వేగం పెంచాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సీఈవో సుదర్శన్‌రెడ్డి



పాల్గొన్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం వీసీ ద్వారా ఎమ్మెల్సీ స్థానాల ఓటరు విచారణ, జాబితా రూపకల్పనపై జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు.

సీఈవో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల స్థానాలకు లక్ష దరఖాస్తులు, టీచర్ల స్థానానికి 2,046 దరఖాస్తులు వచ్చాయన్నారు. పట్టభద్రుల దరఖాస్తులు 7వేలు మాత్రమే విచారణ పూర్తి అయ్యాయన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఉపాధ్యాయుల స్థానానికి 2,730 దరఖాస్తులు రాగా అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయ న్నారు. ఓటరు నమోదు దరఖాస్తులను పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హులైన ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నవంబరు 6 లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితా సవరణ కోసం 'స్వీప్' కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలన్నారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను నవంబరు 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రచురించాలన్నారు. వీసీలో ఆర్‌డీవో కొమురయ్య, డీఆర్‌డీవో వీడీ వసంత, అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

పాలకుర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): లకావత్ శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశాడు. సోమవారం కొండాపురం శివారు మేకలతండాలో చెందిన శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. గిరిజనుల హక్కుల సంరక్షణ కోసం జాతీయ ఎస్టీ కమీషన్ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. శ్రీనివాస్ ఆత్మహత్యలో అధికార పార్టీ నాయకుల హస్తం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామ్మోహన్‌రెడ్డి, దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్ ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

నెల్లికుదురు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కొత్త విద్యుత్ లైన్‌లను నిర్మి ంచినట్లు ఎన్పీడీసీ ఈఎల్ ఎస్ఈ నరేష్ తెలిపారు. నెల్లికుదురు మండల కేంద్రం నుంచి 33 కేవీ లైన్‌లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 132 కేవీ నెల్లికుదురు నుంచి 33-11కేవీ రామాంజపురం వరకు 6.5 కిలోమీటర్ల వరకు లైను నిర్మించినట్లు తెలిపారు. దీంతో 33 కేవీ లైను పై లోడు తగ్గుతుందని నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు డీఈ మధుసూదన్, ఏడీఈ చలపతిరావు, ఏఈ సింధు, ట్రాన్స్‌కో ఎస్ఈ రామ్మోహన్‌రావు, శ్రీనివాసరావు, రమేష్‌కుమార్, రాజిరెడ్డి పాల్గొన్నారు.



నూతన విద్యుత్ లైన్లను ప్రారంభిస్తున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న తోకల చిరంజీవి, తదితరులు

24న కాకతీయ వర్సిటీకి మందకృష్ణ మాదిగ రాక

ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి

కేయూ క్యాంపస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో ఈ నెల 24న నిర్వహించే మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రానున్నారని ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి తెలిపారు.

సోమవారం కేయూ అతిథి గృహం వద్ద మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. సదస్సును మాదిగ ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమవేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నేతలు బొడ్డు దయాకర్, బొర్ర బిక్షపతి, బుర్రి సతీశ్, రాగల్ల ఉపేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదీ.. కొను'గోస తప్పదా?'

(5వ పేజీ తరువాయి)

లేదు. అలాగే మార్కెటింగ్ అధికారులూ కేంద్రాలకు సరఫరా చేయడం లేదు. గోనె సంచులు, లారీల సమస్య ప్రతీ సారీ వేధిస్తూనే ఉంది. ధాన్యం కొనుగోళ్లకు సంచుల కొరత లేదని అధికారులు అంటున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఈ సమస్య తీవ్రంగానే ఉంది. ఈ విషయంలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంచులు లేవనే నెపంతో వారంలో ఓ రోజు కొనుగోళ్లను నిలిపి వేసిన సందర్భాలున్నాయి. లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో అకాల వర్షాలకు తడుస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లర్లు తిరస్కరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జీవో ప్రకారం అయిదుగురు సిబ్బంది ఉండాలి. కేవలం ఒకరిద్దరితో కొనుగోళ్లు చేస్తుండడంతో అలస్యం జరుగుతోంది. కొన్ని చోట్ల బస్తాలు భారీగా చోరీకి గురవుతున్నాయి. గత ఏడాది కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలు చోరీకి గురైన ఘటనలున్నాయి.

కొనుగోలుకు సన్నాహాలు

2024-25 వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి గత నెల 25వ తేదీనే సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబరు మొదటివారం నుంచే కొనుగోళ్ల ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే సాధారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాస్త ఆలస్యంగా నవంబరు మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమవుతాయి. అయినా ముందస్తుగా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. హనుమకొండ జిల్లాలో రెండు రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. అక్టోబరు నెలాఖరు నాటికి కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభం కావాలని కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు.

సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ

ఉమ్మడి జిల్లాలో అక్టోబరు చివరి వారం నుంచి పంట దిగుబడులు మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది. గన్నీ బ్యాగులు, వాహనాలు, కూలీలను సమకూర్చుకునేందుకు ఇప్పటికే ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 19లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నారు. ఇందులో స్థానిక అవసరాలకు పోను కొనుగోలు కేంద్రాలకు సుమారు 14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశాలుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్రం మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ. 2320 కాగా సాధారణ రకానికి రూ. 2300 ధరలు లభించే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ క్వింటాలుకు రూ.500ను ఈ సీజన్ నుంచే రైతులకు అందించేందుకు పౌరసరఫరాల శాఖ మంత్రి సుముఖత వ్యక్తం చేయడంతో ధాన్యం క్వింటాలు ధర రూ.2800 ప్రకారం రైతులకు దక్కనుంది. బోనస్‌కు ఆశపడి పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి కేంద్రాలకు తీసుకురాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సీజన్‌లో 1,137 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా సన్న, దొడ్డు రకాలను కలుపుకొని మొత్తం 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు.

ధాన్యం సేకరణ ప్రణాళిక ఇలా..

జిల్లా	కేంద్రాలు	లక్ష్యం
హనుమకొండ	154	1.50
జనగామ	208	2.30
వరంగల్	203	2.10
మహబూబాబాద్	236	2.35
ములుగు	153	1.50
భూపాలపల్లి	183	2.00

(లక్షల మెట్రిక్ టన్నుల్లో)

కష్ట జీవి..


షెడ్డులో ఉన్న పిల్లలు

పందెం కోడిని చూపిస్తున్న రాంబాబు


నాటు కోడిగుడ్లు

నాటుకోళ్లతో.. కాసుల గలగల

- ఏడాదికి రూ.5లక్షలకు పైగా సంపాదిస్తున్న ప్రైవేట్ లెక్చరర్
- వ్యవసాయం, కోళ్ల పెంపకంలో ఆదర్శంగా నిలుస్తున్న రాంబాబు


భీమదేవరపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఓ ప్రైవేట్ లెక్చరర్.. ఉద్యోగ బాధ్యతలోనే కాదు వ్యవసాయంలోనూ, నాటు కోళ్ల పెంపకంలోనూ భేష్ అనిపించుకుంటున్నారు. ఒక్క నాటుకోళ్ల పెంపకం ద్వారానే ఏడాదికి రూ.5లక్షలకు పైగా ఆదాయం ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ముల్కనూర్‌కు చెందిన నీలం రాంబాబు. రాంబాబు ఎంకామ్, బీఈడీ పూర్తి చేసి.. 20ఏళ్లుగా హనుమకొండ, ముల్కనూర్ ప్రాంతాల్లోని ప్రైవేట్ కళాశాల్లో కామర్స్, అకౌంట్స్ పాఠాలు బోధిస్తుంటారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కళాశాలలో విద్యాబోధన చేస్తారు. దీంతో పాటు తనకు వారసత్వంగా వచ్చిన ఆరెకరాల భూమిలో వ్యవసాయం చేస్తుంటాడు. అయితే ఆరేళ్ల క్రితం ఒక నాటుకోడిని పందెం కోడితో క్రాస్ చేయించగా.. మేలైన నాటుకోడి పిల్లలు రావడంతో ఆయన నాటుకోళ్ల పెంపకంపై దృష్టి సారించారు. అనుకున్నదే తడవుగా తన మామిడి తోటలో సుమారు 20గుంటల్లో నాటు కోళ్ల పెంపకానికి షెడ్డు వేసి నాటుకోడి గుడ్లను పొదిగేయడం, పిల్లలు ఉత్పత్తి చేయించడం ప్రారంభించారు. అయితే ఆ పిల్లలు నాణ్యంగా ఉండడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వారు వచ్చి ఆ పిల్లలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఒక్కో నాటుకోడి పిల్లను రూ.100వరకు అమ్ముతుండగా ఇలా ఏడాది 3వేల నాటుకోడి పిల్లలను అమ్ముతున్నారు. అలాగే మరో 400 నాటుకోళ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నారు. హోల్‌సేల్‌గా కిలో నాటుకోడిని రూ.350చొప్పున విక్రయిస్తుండగా హైదరాబాద్, హుజూరాబాద్, సిద్దిపేట, జనగామ, భూపాలపల్లి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలా సంవత్సరానికి నాటుకోళ్లు, పిల్లల అమ్మకం ద్వారా రూ.5 లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఆర్జిస్తున్నారు.



ఆహ్లాదకర వాతావరణంలో పెంపకం..

ఆహ్లాదకరమైన వాతావరణంలో కోళ్ల పెంపకం చేయడంతో నాటుకోళ్లు ఎలాంటి రోగాల బారిన పడడం లేదు. చుట్టూ మామిడి తోట, పచ్చని పొలాలు ఉండడంతో అవి ఆరోగ్యంగా పెరుగుతున్నాయి. వీటికి తక్కువ ఖర్చుతోనే ఆహారాన్ని సైతం అందిస్తున్నారు. కేవలం వడ్లు, బియ్యంతో పాటు తన పొలంలో పండిన చెడిపోయిన టమాటాలను దాణాగా వేస్తున్నారు. అయితే పసుపు కలిపిన బియ్యాన్ని వేయడం ద్వారా వాటికి రోగాలు దరిచేరవని రాంబాబు పేర్కొంటున్నాడు.

నేటి దృశ్యం



ఇంద్రధనస్సు విరిసె..

ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత.. మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా మారింది. అనుకోని అతిథిలా వర్షం కురిసింది. ఆ సమయంలో నల్లని మబ్బులు కమ్మిన ఆకాశంలో ఇంద్రధనస్సు విరిసింది. హనుమకొండ బాలసముద్రం ప్రాంతంలోని చూడముచ్చటైన ఈ దృశ్యాన్ని చూసిన పట్టణ వాసుల మనసులు పులకించాయి.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

మీకు తెలుసా?



ఒక మండలం.. మూడు రైల్వేస్టేషన్లు

సాధారణంగా ఒక మండలం పరిధిలో ఒకటి, రెండు రైల్వేస్టేషన్లుంటాయి. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండలంలో మూడు రైల్వే స్టేషన్లు ఉండడం విశేషం. కాజీపేట-విజయవాడ రైల్వేసెక్షన్ మధ్య జాతీయస్థాయిలో ప్రముఖమైన గ్రాండ్‌ట్రంక్ మార్గంలో ఇంటికన్నె, కేసముద్రం, తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్లు కేసముద్రం రెవెన్యూ మండల పరిధిలో ఉండడం గమనార్హం. మండల విస్తీర్ణంలో యాదృచ్ఛికంగా ఒక చివరి నుంచి మరో చివర వరకు 18 కిలోమీటర్ల పొడవైన రైల్వేట్రాక్ ఉంది. ఈ ట్రాక్ పరిధిలో అవాస ప్రాంతాలు మూడుచోట్ల ఉండడంతో కొన్ని దశాబ్దాల క్రితమే ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు అనుకూలంగా మూడు రైల్వేస్టేషన్లను రైల్వేశాఖ ఏర్పాటు చేసిందని ఒకే మండల పరిధిలో మూడు రైల్వే స్టేషన్లుండడం రాష్ట్రంలో ఎక్కడా లేదని పలువురు రైల్వే అధికారులు చెబుతున్నారు. ఇటీవలి భారీ వరదల సమయంలో ఇంటికన్నె-కేసముద్రం, తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్ కొట్టుకుపోయి నాలుగు రోజులపాటు రైళ్లరాకపోకలు బంద్‌కావడం జాతీయస్థాయి ఘటనగా నిలిచింది.

- కేసముద్రం

ఆదర్శం


ప్రభుత్వ పాఠశాలలో కూతురికి అడ్మిషన్ తీసుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సుమతి

తాను పనిచేసే బడిలోనే కూతురికి అడ్మిషన్


ఆదర్శంగా నిలిచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

ఆమె ఇటీవలే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగంలో చేరారు. అంతేకాదు తాను పనిచేసే పాఠశాలలోనే తన కూతురిని కూడా చేర్పి ఆదర్శంగా నిలిచారు మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారానికి చెందిన వెన్నెం సుమతి. 2024 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా తన స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే విధుల్లో చేరిన ఆమె తన కుమార్తె అద్వినికకు కూడా ఒకటో తరగతిలో అడ్మిషన్ తీసుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సుమతిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధరావత్ కిషన్‌నాయక్ అభినందించారు.

- దంతాలపల్లి

మత్స్యకారుల పూజలందుకునే మహా వృక్షం

- 200ఏళ్ల కట్టమైసమ్మ చింత చెట్టుకు ప్రత్యేకత



అది వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామం. ఆ గ్రామంలోని గుండం చెరువు కట్టపై ఉన్న కట్టమైసమ్మ చింత చెట్టుకు సుమారు 200 ఏళ్లు ఉన్నట్టు గ్రామస్థులు చెబుతుంటారు. స్థానికులు కట్టమైసమ్మ చింతచెట్టుగా పిలుచుకునే ఈ మహావృక్షం మత్స్యకారుల పూజలందుకుంటోంది. గ్రామంలోని సుమారు 300 మంది మత్స్యకారులు.. చెరువులో చేపలు పట్టే సమయంలో ఈ చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తారు. కోళ్లు, గొర్రెలను బలిచ్చిన అనంతరమే చేపలు పట్టుకుంటారు. గొర్రెల, కోళ్లను బలిచ్చిన తర్వాత వాటి కాళ్లను వేరుచేసి చెట్టు కొమ్మలకు కట్టి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఒక్క మత్స్యకారులే కాదు గ్రామంలోని మిగతా కులాల వారు కూడా మైసమ్మ చింత చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తారు. మరో విశేషం ఏంటంటే.. కాకతీయుల కాలంలో ఈ చెరువును నిర్మించారని, అదే సమయంలో కట్టపై చింత చెట్టు మొలిచిందని, తమ పూర్వీకుల నుంచే మైసమ్మ చింత చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

- దుగ్గొండి

ఐదేళ్ల చిన్నారి.. అదరహో..

కూచిపూడిలో సత్తా చాటుతున్న రిహాన్షి


కలెక్టర్ రిజ్వాన్ బాషా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రిహాన్షి



కళ

జనగామ కల్చరల్, అక్టోబరు 21 : ఆ చిన్నారి వయసు ఐదేళ్లు. అయితేనేం కూచిపూడి నాట్యం చేయడంలో దిట్ట. చిన్నతనంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అందరి మన్ననలు పొందుతోంది. అంతే కాదు వివిధ రాష్ట్రాల్లోని ప్రముఖ దేవస్థానాలు, వేదికలపై నృత్య ప్రదర్శనలిస్తూ ప్రముఖుల నుంచి సత్కారాలు, ప్రశంసాపత్రాలు, అవార్డులు అందుకుంటోంది. ఆమే.. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన నరసింహమూర్తి, శ్వేతాలక్ష్మి దంపతుల కుమార్తె కె.ఎల్.ఆర్.రిహాన్షి. ప్రైవేటు ఉద్యోగి అయిన నరసింహమూర్తి తన కుమార్తెకు నాట్యంపై ఉన్న ఆసక్తిని గమనించి జనగామ జిల్లా కేంద్రంలోని మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రస్తుతం రెండో తరగతి చదువుతున్న రిహాన్షి నృత్యంతో పాటు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఫిబ్రవరిలో జనగామలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల్లో 41 నిమిషాల పాటు నిరంతర నృత్య ప్రదర్శన చేయడంతో పాటు 42వేమన పద్యాలను చెప్పి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకుంది. దీంతో ఐదేళ్ల వయసులో ఈ రికార్డు నమోదు చేయడం మొదటిసారి కావడంతో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడెమీ వారు 'స్ట్రాంగ్ గర్ల్' పేరుతో హీరో సుమన్ చేతుల మీదుగా రుద్రమదేవి అవార్డు ఇచ్చి గౌరవించారు.

రిహాన్షి ఇచ్చిన ప్రదర్శనల్లో కొన్ని..

రాంకోటిలోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో హీరో సుమన్ సమక్షంలో మొదటి ప్రదర్శన ఇచ్చిన రిహాన్షి.. కడ్తాల్‌లో పిరమిడ్ ఆధ్యాత్మిక సంస్థ వేదికపై అనేక ప్రదర్శనలు ఇచ్చింది. అలాగే బెంగళూరు, షిరిడీ సాయినాథుడు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో పలుమార్లు ప్రదర్శనలు ఇచ్చింది.

వీటితో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న రిహాన్షి గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ఆధ్వర్యంలో కళాకారుల సమ్మేళనంలో నృత్య ప్రదర్శన ఇచ్చి గవర్నర్ ప్రశంసలందుకుంది. బుద్ధ గయ లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పర్యావరణ శాఖ మంత్రి ప్రేమ్‌కుమార్ సమక్షంలో ప్రదర్శనలో పాల్గొంది. రిపబ్లిక్‌డే, పంద్రాగస్టు, గురుపూజోత్సవ కార్యక్రమాల్లో ప్రదర్శనలిచ్చి పూర్వ, ప్రస్తుత కలెక్టర్లు శివలింగయ్య, షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ సీతారాంల నుంచి ప్రశంలందుకుంది.


నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

పోలీసు అమరులు ప్రజల గుండెల్లోనే ఉంటారు

- వారి త్యాగాలు చిరస్మరణీయం
- సంస్మరణ దినోత్సవంలో సీపీ అంబర్ కిశోర్ ఝా
- హాజరైన కలెక్టర్లు ప్రావీణ, సత్యశారద, అమరుల కుటుంబాల సభ్యులు


శోక శస్త్రో చేసి నివాళులర్పిసున్న పోలీసులు



నివాళులర్పిస్తున్న కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద



హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమర వీరులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సోమవారం వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆవరణలోని పోలీసు అమర వీరుల స్తూపం వద్ద పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాం సందర్భంగా గతే డాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 241 మంది పోలీసు అమర వీరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. అనం తరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీతో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య, కల్నల్ రవి కుమార్, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, అదనపు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, అ మరుల కుటుంబాల సభ్యులు, ఇతర పోలీసు సిబ్బంది స్తూపం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆర్ఐ స్పర్జన్ సారథ్యంలో సా యుధ పోలీసులు శోక్ శ్రస్త్ర చేసి మరణించిన పోలీసు అమర వీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది, అమర వీరుల కుటుంబ సభ్యులు రెండు నిమి షాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ ఝా మాట్లాడుతూ పోలీసు అమర వీరుల త్యాగాలను మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే ఉంటారన్నారు.

పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నప్పుడు కొందరు కుటుంబ సభ్యులు కన్నీళ్లు అపుకోలేక పోయారు. స్తూపం ముందు విలపించిన దృశ్యాలు హృదయాలను ద్రవింప చేశాయి. ఆ తర్వాత పోలీసు కమిషనరేట్ కార్యాలయం నుంచి మిషన్ ఆస్పత్రి వరకు నిర్వహించిన ర్యాలీలో పోలీసులు, అధికారులు, సిబ్బంది పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులతో పాటు పోలీసు జాగృతి కళా బృందం సభ్యులు పాల్గొని అమర వీరులకు జోహార్లు అర్పించారు.


నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

రారెత్తిస్తున్న ఇసుక లారీలు

- ప్రధాన రహదారిపై నిలిపివేత
- నిత్యం ప్రమాదాలతో ప్రజలు బెంబేలు
- ఓవర్‌లోడ్‌తో ధ్వంసమవుతున్న రోడ్లు

మంగపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు మండలానికి వస్తూ రారెత్తిస్తున్నాయి. రోడ్డు వెంట ఇరువైపులా నిలుపుతుండడంతో రైలు భోగీలను తలపిస్తున్నాయి. ఈ రెండు జిల్లాల సరిహద్దులో గల గోదావరి తీరం వెంట ప్రభుత్వం గుర్తించిన ఇసుక క్వారీల నుంచి గతంలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి డంప్ చేసి భూములలో గుట్టలుగా పోసివుంచారు. ఆ ఇసుకను ప్రస్తుతం లారీలలో వరంగల్, హైదరాబాద్ నగరాలకు తరలిస్తున్నారు. అలాగే సుదూర ప్రాంతాల నుంచి వందలాది లారీలు నిత్యం వస్తున్నాయి. మండలంలోని కమలాపురం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని పలుచోట్ల గల ఇసుక క్వారీల నుంచి ఏటూరునాగారం వరకు బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై వందలాది లారీలు తిరగడం వలన ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రాత్రి, పగలు ఇసుక లారీలను ఎక్కడ పడితే అక్కడ నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ సంవత్సరం పట్టా భూములకు అధికారులు ఇబ్బడిముబ్బడిగా ఇవ్వడంతోపాటు సొసైటీలకు ఇసుక ర్యాంపులకు అనుమతులు ఇచ్చారు. దీంతో వందలాదిగా లారీలు తరలివచ్చి ఇసుకను తరలించుకొని వెళ్తున్నాయి. ఈ రహదారిపై ఎక్కడ చూసినా కనుచూపు మేర ఇసుక లారీలే కనిపిస్తుంటాయి.

మితిమీరిన వేగంతో పాటు అధికలోడ్‌తో వెళ్తుండడంతో ఎటునుంచి ఏ ప్రమాదం జరుగుతోందనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన ప్రధాన రహదారిపై అనేక చోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో పలువురు ప్రమాదాల బారిన పడిన సంఘటనలున్నాయి. రాత్రి వేళల్లో మద్యం మత్తులో కొందరు ఆగివున్న లారీలను ఢీకొన్న సంఘటనలు ఉన్నాయి. ఇటీవల గంపోనిగూడెం మార్కెట్ గోదాంల సమీపంలో కల్వర్టును ఢీకొట్టడంతో రాత్రి సుమారు రెండు గంటల పాటు ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో జేసీబీని తీసుకొచ్చి రోడ్డుకు అడ్డంగా పడ్డ ఇసుక లారీని తొలగించి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఇదే ప్రధాన రహదారిపై పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉన్నతాధికారులు ప్రయాణిస్తున్నా నియంత్రణ చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇసుక లారీల అతివేగాన్ని, అధిక లోడ్‌ను నియంత్రించి రోడ్లపై విచ్చలవిడిగా నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మంగపేట ప్రధాన రహదారిపై నిలిపిన ఇసుక లారీలు, కమలాపురం-మంగపేట మధ్య ధ్వంసమైన రోడ్డు

రేణుక ఎల్లమ్మ ఆలయంలో దర్వాజ ప్రతిష్ఠాపన

మహాముత్తారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గీతకార్మికులు నూతనంగా నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం దర్వాజ ప్రతిష్ఠాపన చేయడానికి వేదండితులు పూజలు నిర్వహించారు. పూజారి సదానందచారి ఆధ్వర్యంలో పూజారులు, గీతకార్మిక కుటుంబాలు మంగళహారతులతో రాగా దర్వాజ ప్రతిష్ఠాపన చేశారు. మరికొద్ది రోజుల్లో దేవాలయ నిర్మాణం పూర్తి చేసి ప్రాణప్రతిష్ఠ పూజలు నిర్వహించి ప్రారంభించడం జరుగుతందని పూజారులు తెలిపారు. గౌడ సంఘం పెద్దలు, గీతకార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రేగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలోని మిరప తోటలను వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు చిరుపోతుల సాంబయ్య మిరప క్షేత్రాన్ని సందర్శించి సూచనలు చేశారు. తెగుళ్ల నివారణకు ఐదు కిలోల ఫ్యూరడాన్ 3జీ గులికలు 10కిలోల ఇసుకలో కలిపి మొక్క మొదలులో చల్లాలన్నారు. అలాగే 3కిలోల ట్రైసిలోఫైసిస్, 100కిలోల వేపపిండిలో లేదా పశువుల ఎరువులో గాని కలిపి చల్లాలని సూచించారు. ఈ సమస్యను గుర్తించిన సమయంలో నీటి తడులను నిలిపివేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీం విగ్రహావిష్కరణకు తరలిరావాలి

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఈనెల 24న ఆదివాసీలు తరలిరావాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. సోమవారం ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వై-జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహావిష్కరణ సభను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. మంత్రి ధనసరి సీతక్కతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ ఎమ్మెల్యే విక్రమ్ మాండవి, ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. సమావేశంలో నాయకులు పోడెం కృష్ణప్రసాద్, కోటి రవి, పోడెం బాబు, చింత కృష్ణ, వట్టం జనార్దన్, చందా మహేష్, ఆలం రాంబాబు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వెంకటాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత్రాపురం, నూగూరు, వెంకటాపురం, మరికాల, చొక్కాల గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వేర్వేరుగా వైద్య శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్యాధికారులు సోహెల్, ఆశిష్, పవన్, వినయ్ ఆయా గ్రామాల్లోని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శిబిరాల్లో సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం


అన్నారంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ

మహదేవపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో సీఐ రామచంద్రరావు, ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో 12 సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ రామచంద్రరావు మాట్లాడుతూ సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. చోరీలు జరిగినప్పుడు దొంగలను గుర్తించడానికి వీలుగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడడం వల్ల యువత చెడుమార్గం వైపు పయనిస్తారని అన్నారు. ఎవరైనా డ్రగ్స్ అమ్మినా.. కొన్నా కఠిన చర్యలు తప్పవన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలి

చిట్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ అన్నారు. సోమవారం మండలకేంద్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో పత్తి పంట తెగుళ్ల బారినపడి దిగుబడితగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పత్తిని గ్రామాల్లో స్థానిక వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. స్థానికంగా సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఈప్రాంత రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు రేణికుంట్ల రాజేష్, ఆనందం పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు, సిబ్బంది

కాటారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారంపేట గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి ఫీవర్ సర్వే చేపట్టారు. సీహెచ్‌వో నిర్మల మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే డెంగీ, చికున్ గున్యా, కలరా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, వాటిని నివారించడానికి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిధ పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించి దోమల నివారణ మందులు చల్లించారు. జ్వరం వస్తే వైద్య సిబ్బందిని లేదా పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. కార్యక్రమాల్లో హెచ్‌ఏ సమ్మయ్య, ఏఎన్ఎం శ్యామల, ఆశా కార్యకర్త లత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

తాడ్వాయి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, వరంగల్, కరీంనగర్ ఎమ్మెల్సీ ఓటరుగా ఉపాధ్యాయులు పేరు నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుతారి పాపారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు మండలంలోని పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యా సమస్యలు, సామాజిక సమస్యలపై అవగాహన కలిగి మాట్లాడే వ్యక్తులను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాణాల సుధాకర్, అక్బర్‌పాషా, జీవన్‌లాల్, సమ్మయ్య, జైపాల్, వెంకటేశ్వర్లు, విజయ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరుకాని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

గోవిందరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాస్టళ్లలో విధులకు సక్రమంగా హాజరుకాని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిరిపల్లి జీవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని హాస్టళ్లను నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ హాస్టళ్లలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వార్డెన్లు విధులకు రెగ్యులర్‌గా రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సక్రమంగా తాగునీటి సౌకర్యం లేదని, ఫ్యాన్లు, బాత్‌రూంలు పనిచేయడం లేదని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విధులకు హాజరుకాని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనట్లయితే పెద్దఎత్తున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

స్నేహితుడికి సాయం

మంగపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురంకు చెందిన ఎంపీపీ నర్సింహారావు పేదరికంతో కొట్టుమిట్టాడుతూ అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు రూ.30వేలు పోగు చేసి సోమవారం స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో బాధితుడికి అందజేసి ఉదారతను చాటుకున్నారు.ఇప్పలపల్లి రమేష్, నల్లూరి నాగేశ్వర్‌రావు, కోరుకొప్పుల శంకర్‌గౌడ్, బండారి లింగమూర్తి, రవి, టి. రాంబాబు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌ను తెరవాలి

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాకేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను తెరవాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎమ్డీ. అమ్జద్‌పాషా ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమ్జద్‌పాషా మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా సెంటర్‌లో పరికరాలు ఉండి ఉద్యోగులు లేకపోవడంతో రోగులు వరంగల్‌కు వెళ్తున్నారని, కొన్ని సందర్భాల్లో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సరిపడా ఉద్యోగులను నియమించి డయాలసిస్ సెంటర్‌ను ఓపెన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బోడ రమేష్, మండల కమిటీ సభ్యురాలు కొయ్యడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

మేడారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంలోని పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పాడి రైతుల పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వెటర్నరీ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. రైతులు ముందుగానే వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేసుకోవాలని సూచించారు. పరిసర గ్రామాలతో పాటుగా ఇప్పటి వరకు 400 పశువులకు ఉచిత టీకాలను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నిమ్మల బాలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేసే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

టేకుమట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల అధికారంలో ఉండి రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీకి రైతుల గురించి ధర్నా చేసే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ నాయకులు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని ధర్నా చేయడం సిగ్గుచేటని అన్నారు. రైతు భరోసా అనేది నిజమైన రైతులకు అందించడానికి చేపట్టే కట్టుదిట్టమైన చర్యల మూలంగా ఆలస్యమవుతుందని, రైతు భరోసా ఇవ్వమని కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడలేదన్నారు. తొందరలోనే రైతు భరోసా అందిస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులకు అవగాహన లేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. నాయకులు రవీందర్, దాసారపు సదానందం, బండి రవీందర్, మాదం కొంరయ్య, వీరేశం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

కాటారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ప్రజల కోరిక మేరకు నియోజకవర్గంలోని పలు మండలాల్లో గ్రామీణ ప్రాంతాల రోడ్ల నిర్మాణం కోసం సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.25కోట్ల నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపా ధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, నాయకులు దేవేందర్‌రెడ్డి, శ్రీహరి, లచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘురాం, జక్కిరెడ్డి, రఘునందన్, మాధవరెడ్డి, మల్లయ్య, ఉంసింగ్, సమ్మయ్య, మధూకర్, మహేష్, రాజునాయక్, రాజ్‌కుమార్, శకుంతల, చీమల రాజు, నరేష్, ప్రభాకర్, రవి, నరోత్తంరెడ్డి, భగవాన్‌రెడ్డి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


కాటారంలో మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సేవాలాల్ జయంత్యుత్సవాల నిధుల విడుదల

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 2023లో జరిగిన సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలకు సంబంధించిన నిధులు మంజూరైనట్లు గంధ్రాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2023 సంవత్సరంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన రూ.18లక్షలను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిందని, అన్ని జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో నిధులు ఉన్నట్లు తెలిపారు. జయంతి ఉత్సవాలను చేపట్టిన లంబాడ సోదరులు కలెక్టర్ల వద్దకు వెళ్లి వివరాలను సేకరించి నిధులు మంజూరు చేయించుకోవాలని అన్నారు. సమావేశంలో లంబాడ ఐక్య వేదిక అధ్యక్షుడు భూక్య సోమనాయక్, పోరిక సునీల్, అజ్మీరా దేవ్‌సింగ్, కుమార్, రతన్‌సింగ్ పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

గోవిందరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి గ్రామ శివారులో గల తెలంగాణ స్పెషల్ పోలీసు ఐదవ బెటాలియన్‌లోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమాండెంట్ టి.అలెక్స్ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సాయుధ పోలీసులు శోక్‌శస్త్ చేసి మరణించిన పోలీసు అమరవీరులకు అధికారులు, సిబ్బంది మౌనం పాటించారు. అనంతరం కమాండెంట్ అలెక్స్ గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 214 మంది పోలీసు అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు కృషిచేసి అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని, విధి నిర్వహణలో ప్రజలను రక్షించేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసుల త్యాగాలు నేటి పోలీసులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, సాల్మన్‌రాజ్, శ్రీనివాసులు, అన్నయ్య, రాంప్రసాద్ పాల్గొన్నారు.


చల్వాయిలో పోలీసు బెటాలియన్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ అలెక్స్, పోలీసు అధికారులు

షటిల్ టీం, నేతల రక్తదానం

కాటారం(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆదర్శనగర్ షటిల్ టీం సభ్యులు, పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం రక్తదానం చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆధ్వర్యంలో షటిల్ టీం సభ్యులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్ ఆధ్వర్యంలో యూత్ నాయకులు అమరవీరులకు నివాళులర్పించి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందరినీ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ అభినందించారు. కార్యక్రమంలో టీం సభ్యులు కుమ్మరి అశోక్, భూపెల్లి రాజు, రాంనారాయణ, ఆత్మకూరి కుమార్, రాజేంద్రప్రసాద్, సురేందర్, వినయ్, యూత్ నాయకులు మధుకర్‌రెడ్డి, కోడి రవికుమార్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

(5వ పేజీ తరువాయి)

పోలీసు శాఖ అన్నారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాల్లో కూడా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అక్టోబరు 21 నుంచి 31 వరకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు, విధి నిర్వహణలో అమరులైన పోలీసులను గుర్తు చేసుకొనుటకు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు.

జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలుకోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ చిరస్మరణీయమని అన్నారు. భూపాలపల్లి జిల్లాలో దశాబ్దాల క్రితం మావోయిస్టులప్రాబల్యం ఎక్కువగా ఉండేదని, జిల్లా పరిధిలో 18 మంది పోలీసులు సంఘవిద్రోహశక్తులతో పోరాడి చిరస్మరణీయులయ్యారని గుర్తుచేశారు. అమరవీరుల కుటుంబీకులకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీలు అవిర్నేని సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణ నాయక్‌తో పాటు జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కళ్లు తిరిగి కిందపడ్డ కానిస్టేబుల్

భూపాలపల్లిలోని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకల్లో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. కార్యక్రమం ప్రారంభంలో భాగంగా పోలీసు పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈక్రమంలో పరేడ్‌లో వెనుక వరుసలో ఉన్న బీడీ టీమ్ కానిస్టేబుల్ మహేష్ కళ్లు తిరిగి కిందపడిపోయాడు. ఆ వెంటనే గమనించిన తోటి కానిస్టేబుళ్లు ఆయన వద్దకు వెళ్లి పక్కకు తీసుకెళ్లారు. కాగా, జ్వరంతో బాధపడుతున్న సదరు కానిస్టేబుల్ పరేడ్‌లో సుమారు గంటపైకు నిల్చొని ఉండటం మూలంగా స్పృహ తప్పి కిందపడిపోయినట్లు తోటి సిబ్బంది వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

(5వ పేజీ తరువాయి)

చేశారు. వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధులను అరికట్టాలన్నారు. చింతూరు, ధర్మవరం, గుమ్మడిదొడ్డి, వాజేడు, ఏడ్జర్లపల్లి, పూసూరు జీపీలలో నిర్వహించిన సమావేశాలలో స్థానికులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ, విద్యుత్, డ్రైనేజీలు, సీసీరోడ్లు, తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని, ఈ విషయంపై వరంగల్, భద్రాచలం డిపోల మేనేజర్లతో ఆయన ఫోన్‌లో మాట్లాడి బస్సులు నడపాలని సూచించారు. మండలంలో సుమారు రూ.7 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, దీపావళి తరువాత వాటికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లె డెనార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, పీఏసీఎస్ చైర్మన్ యగ్గడి అంజయ్య, వైస్ చైర్మన్ జగన్నాథరాజు, సీనియర్ నాయకుడు విశ్వనాథ ప్రసాదబాబు రాజు, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ శారద, పుష్పలత, నాయకులు దాట్ల వాసు, చెన్నం ఎల్లయ్య, దుర్గారావు, ఖాజావలి, తిరుపతయ్య, రమేష్, తహసీల్దార్ వీరభద్రప్రసాద్, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి, ఎస్సైలుకృష్ణప్రసాద్,హరీష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు

మహాముత్తారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంపేట క్రాస్ వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసి భూపాలపల్లి కోర్టుకు తరలించినట్లు ఎస్సై మహేంద్రకుమార్ తెలిపారు. మాదారం గ్రామానికి చెందిన బచ్చల సమ్మయ్యకు ఐదు రోజుల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించగా, పోలంపల్లి గ్రామానికి చెందిన ఎండీ అలీమ్‌కు రెండు రోజుల జైలుశిక్ష రూ.వెయ్యి జరిమానా జడ్జి విధించినట్లు తెలిపారు.

ఇంచెంచెరువుపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు

వెంకటాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంచెంచెరువుపల్లి గ్రామంలో బూత్ అధ్యక్షుడు అరకావత్ భీముడు ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కొనసాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్రియాశీల సభ్యత్వ జిల్లా ఇన్‌చార్జ్ భూక్య జవహర్‌లాల్, నాయకులు ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వాలను సేకరించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు నగరపు రమేష్, మహేందర్, చిట్ల ప్రభుతేజ, భూక్య కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జంగాలపల్లిలో ఎయిడ్స్‌పై కళాజాత

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో రమేష్ కళాబృందం కళాకారులు సోమవారం ఆటపాటల ద్వారా కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో మారి స్వచ్ఛంద సంస్థ పీఎం సదానందం, అవుట్‌రిచ్ వర్కర్ జన్ను జ్యోతి, ములుగు ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ జాటోత్ కుమార్‌సింగ్, మారి సంస్థ సిబ్బంది, కళాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంస్కృతి సంపద లాంటిది : మంత్రి సీతక్క

వెంకటాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంపద వంటిదని, ప్రతి ఏటా రామప్పలో వలంటీర్ల శిక్షణ నిర్వహించడం అభినందనీయమని, ఈ శిక్షణ కాకతీయుల చరిత్రను విశ్వవ్యాప్తం చేయడంలో ఎంతగా ఉపయోగపడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని పాలంపేటలో గల రామప్ప దేవాలయంలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ శిక్షణ, యువ టూరిజం క్లబ్ వలంటీర్ క్యాంప్ ఏడో రోజు సోమవారం జరిగింది. ఈ శిక్షణ శిబిరాన్ని మంత్రి సీతక్క సందర్శించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రామప్ప, కాకతీయుల చరిత్రను గుర్తుచేస్తూ రామప్ప ప్రపంచ స్థాయికి ఏ విధంగా ఎదిగిందని నిట్ రిటైర్డు ప్రొఫెసర్ పాండురంగారావును ప్రశంసిస్తూ పలు అంశాలను సూచించారు. అనంతరం మంత్రి సీతక్కకు ప్రొఫెసర్ పాండురంగారావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ సూర్యకిరణ్‌లు పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ విజయబాబు, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన జిల్లా రైస్‌మిల్లర్స్

ములుగు కలెక్టరేట్ : ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను ఇటీవల నూతనంగా ఎంపికైన జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ్యులు ఆమెకు మొక్కను అందజేశారు. అనంతరం మంత్రి సీతక్క సభ్యులను శాలువాలతో సన్మానించి మాట్లాడారు. రైస్‌మిల్లర్ల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పల్లెపాటి సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సహోదర్‌రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్, ఉపాధ్యక్షుడు అక్కల రఘోత్తం, సంయుక్త కార్యదర్శి భద్రయ్య, సభ్యులు లక్ష్మీనారాయణ, శ్రవణ్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రఘు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

ఏటూరునాగారం : మండలంలోని షాపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సహాయ కార్యదర్శి, సీనియర్ నాయకుడు ముద్రబోయిన రఘు కాలేయ వ్యాధితో ఇటీవల మృతి చెందాడు. కాగా, సోమవారం దశదిన కర్మకు మంత్రి సీతక్క హాజరై రఘు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం రఘు ఎంతో విలువైన సేవలు అందించారన్నారు. అతని మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.2లక్షల ఆర్థిక సహాయం చేశారు. అంతేకాకుండా చిన్నబోయినపల్లిలో 29 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి వెంట జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి యాదవ్, మాజీ జడ్పీటీసీ చెందు, అయ్యూబ్ తదితరులు ఉన్నారు.

డీసీవోగా కాటారం ఎస్టీ గురుకులం ప్రిన్సిపాల్

కాటారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకులాల పర్యవేక్షణ కోసం జిల్లా సమన్వయ అధికారి(డీసీవో)గా కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులం ప్రిన్సిపాల్ లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు గిరిజన గురుకులాల కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. డీసీవోగా నియమితులైన ప్రిన్సిపాల్ లాలును ఎస్టీ బాలుర, బాలికల గురుకులాల బోధన, బోధనేతర సిబ్బంది బొకేలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, బాలుర కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, సరిత, కల్పన, అధ్యాపకులు బలరాములు, వెంకటయ్య, రజనీకాంత్, సంపత్, రాజయ్య, రామకృష్ణ, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, బోధనే తర సిబ్బంది వీరయ్య, రవీందర్, మల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.